క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు

బేస్తవారిపేట: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ గ్రామర్, చెస్‌లపై శిక్షణ ఇచ్చారు. వేసవి విజ్ఞాన శిబిరంలో 15 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

తాళ్లూరు (ముండ్లమూరు): గ్రామాల్లో ఎన్నికల నిబంధనల్లో భాగంగా 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రజలు సంయమనం పాటించాలని ఎస్‌ఐ వైవీ రమణయ్య తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరు గెలిచినా నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజలు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, వైశాఖ మాసం, కృత్తిక నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయస్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చ‌లా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ప్రయాణికులు తికమక!

- మార్కాపురం రైల్వేస్టేషన్‌లో డిస్‌ప్లే బోర్డులు నిల్
- రైళ్లు ఏ ప్లాట్‌ఫాం మీద ఆగుతాయో తెలియదు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు



ప్లాట్‌ఫాంపై డిస్‌ప్లే లేని మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్

మార్కాపురం: మార్కాపురం రోడ్ రైల్వేస్టేషన్‌లో రైళ్ల రాకపోకలు సూచించే సమాచార బోర్డులు ప్లాట్‌ఫాంలపై లేకపోవడంతో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు, జనరల్ బోగీలో ప్రయాణాలు చేయాలనుకునేవారు బోగీలు ఎక్కడ ఉంటాయో తెలియక అవస్థలు పడుతున్నారు. మార్కాపురం రైల్వేస్టేషన్ మీదుగా రోజూ రేపల్లె-మార్కాపూర్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(గరీబ్‌రథ్), సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-డోన్ ఎక్స్‌ప్రెస్, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం-హుబ్లీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్, కాచీగూడ, కొండవీడు ఎక్స్‌ప్రెస్, వాస్కోడీగామా-అమరావతి, హుబ్లీ-అమరావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. మార్కాపురం ప్రాంతానికి చెందిన పలువురు ప్రయాణికులు వ్యాపార నిమిత్తం, వైద్య సేవల కోసం అటు గుంటూరు, విజయవాడ, ఇటు నంద్యాల, కర్నూల్‌కు వెళ్తుంటారు. రిజర్వేషన్ చేయించుకున్నవారు ప్లాట్‌ఫాంపైకి వచ్చి తమ రిజర్వేషన్ కోచ్ ఎక్కడో తెలియక చాలా అవస్థలు పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ రైల్వేస్టేషన్ రోడ్‌లో చాలా దూరంలో ఆగుతున్నాయి. దీంతో ఏ కోచ్ ఎక్కడ ఉంటుందో తెలియక రైలు ఆగిన సమయంలో ప్రయాణికులు పిల్లా పాపలతో లగేజీ మోసుకుంటూ పరిగెత్తుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ క్రమంలో పలువురు రైలుకు ప్లాట్‌ఫాంకు మధ్య పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రైలును చాలా దూరం తీసుకెళ్లి ఆపడంతో బీ1, బీ2, బీ3, బీ4 కోచ్‌ల కోసం ప్రయాణికులు వెతుక్కుని వెళ్లాల్సి వస్తోంది. రైలు కేవలం 2 నిమిషాల వ్యవధి మాత్రమే ఉండటంతో కోచ్ ఎక్కడో కనుగొనేలోపే రైలు బయలుదేరుతోంది. దీంతో రిజర్వేషన్ చేయించుకున్నా కూడా రైలెక్కి గమ్యస్థానానికి చేరలేక పోతున్నారు.

శ్రీశైలం ప్రయాణికులకూ తిప్పలు

ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి శ్రీశైల మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు రైళ్లలో వచ్చే యాత్రికులు మార్కాపురం రోడ్ స్టేషన్‌లోనే దిగుతారు. మళ్లీ తిరుగు ప్రయాణంలో రైళ్లోనే వెళ్తుంటారు. డిస్‌ప్లే బోర్డులు లేకపోవడంతో ప్రయాణికులంతా ఇబ్బంది పడుతున్నారు. ఏటా ఈ రైల్వేస్టేషన్ నుంచి దక్షిణ మధ్య రైల్వేకు సుమారు 5 కోట్ల రూపాయల మేర ఆదాయం వస్తున్నప్పటికీ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నిర్మానుష్యంగా రహదారులు

కొమరోలు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మంగళవారం పోలీసు అధికారులు 144 సెక్షన్ విధించడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు, సిబ్బంది మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి నుంచే వ్యాపార సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు మూసివేశారు. మంగళవారం బ్యాంక్‌లు, పోస్టాఫీసుల్లో ఖాతాదారులు లేక వెలవెలబోయాయి. ఉద్యోగులు కూడా ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వీధులు నిర్మానుష్యం

కొనకనమిట్ల: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మంగళవారం మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. 144 సెక్షన్ విధించడం, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండటంతో ప్రజలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. డీఎస్పీ బాలసుందరరావు ఆధ్వర్యంలో మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో పోలీస్ అధికారులు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. కొనకనమిట్లలో ఎస్సై మాధవరావు అన్ని గ్రామాల్లో తమ సిబ్బందితో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రం మార్కాపురంతోపాటు అన్ని గ్రామాల్లో ముందుగానే దుకాణాలు మూసివేయించడంతో ప్రధాన రహదారులతోపాటు వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి.



నిర్మానుష్యంగా ఉన్న గొట్లగట్టు బస్టాండ్



ఖాతాదారులు లేక వెలవెలబోయిన యూనియన్ బ్యాంక్



బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్‌రావు



కొనకనమిట్లలో పోలీసుల పర్యవేక్షణ

నీట్‌లో జ్ఞానశ్రీ విద్యార్థుల ప్రతిభ



మోహన్‌పూర్ణ



రాగ అక్షయ



మహమ్మద్ నిహాల్

మార్కాపురం టౌన్: నీట్-2024 ఫలితాల్లో మార్కాపురం పట్టణంలోని జ్ఞానశ్రీ నీట్ అకాడమీ విద్యార్థులు ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు మంగళవారం తెలిపారు. 720 మార్కులకుగాను జి.మోహన్‌పూర్ణ 575 మార్కులు, కె.రాగ అక్షయ 530 మార్కులు, ఎస్‌కే మహమ్మద్ నిహాల్ 380 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకాడమీ డైరెక్టర్, అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోండి



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథపాలకుడు

ఉలవపాడు: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం జరిగిన వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలని కోరారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు, మహనీయుల చరిత్రలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను చదివించారు. మొత్తం 52 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు.

వైభవంగా గంగాభవానీ గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగాభవానీ మూల, ఉత్సవ విగ్రహమూర్తులు

పామూరు: మండలంలోని మోపాడు గంగా భవానీ తిరునాళ్లలో భాగంగా 3వ రోజు మంగళవారం గంగామాత గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోపాడు గంగానగర్, లక్ష్మీ నరసాపురం, ఇనిమెర్ల గ్రామాల్లో గంగాభవాని ఉత్సవ విగ్రహమూర్తిని, బొల్లావులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్చుతూ ఉత్సవం నిర్వహించారు. ముందుగా గంగామాత ఆలయంలో గంగామాత మూల విగ్రహమూర్తికి అభిషేకం, కుంకుమపూజ, విశిష్ట పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



గంగాభవాని ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వ్యాధులు సోకకుండా జాగ్రత్త వహించాలి

బల్లికురవ: వర్షాల సీజన్ ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తతో తగు జాగ్రత్తలు వహించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ మంగళవారం తెలిపారు. వర్షాలకు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ సోకే ప్రమాదం ఉందని పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధులు సోకకుండా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. నిలువ ఉన్న ఆహారాలు తీసుకోవద్దని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, కుంటలు, చెరువులోని నిలువ ఉన్న నీరు తాగవద్దని చెప్పారు. అస్వస్థతకు లోనైతే తక్షణమే వైద్యశాలలకు వెళ్లి వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు



హెచ్చరికలు చేస్తున్న సీఐ సుబ్బారావు



ముండ్లమూరులో మాట్లాడుతున్న డీఎస్పీ అశోకవర్ధన్



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

కురిచేడు: ఎన్నికల ఫలితాల సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్ట చర్యలను సీఐ సూరేపల్లి సుబ్బారావు తీసుకున్నారు. సోమవారం సాయంత్రం నుంచి షాపులను మూసివేయించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా పేల్చటం లాంటి వాటిని నిషేధించారు. మంగళవారం సాయంత్రం వరకు షాపులు తెరుచుకోలేదు. ప్రజలు కూడా బయటకు రాకుండా ఇళ్లకే పరిమితమయ్యారు.

భారీ బందోబస్తు నడుమ ప్రశాంతంగా దర్శి

దర్శి: ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా దర్శి పట్టణంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్ ఆధ్వర్యంలో భారీ బందో బస్తును చేపట్టారు. పట్టణంలో 144 సెక్షన్ పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిత్యం పోలీసులు వీధుల్లో సంచరిస్తూ దుకాణాలు మూసి వేయించారు. ఎలాంటి అల్లరి మూకలు వీధుల్లో లేకుండా నివాసాల్లో నుంచి బయటకు రాకుండా ఆంక్షలు విధించారు. దీంతో పట్టణంలోని వీధులు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు మూసి వేయడంతో జన సంచారం తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎటువంటి అల్లర్లు లేకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. లెక్కింపు పూర్తి అయ్యే వరకు బందోబస్తు కొనసాగింది.

కౌంటింగ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు

ముండ్లమూరు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు దర్శి డీఎస్పీ అశోకవర్ధన్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతల గురించి ఆరా తీశారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా గ్రామాల్లో గొడవలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు సంయమనం పాటించి శాంతిభద్రలకు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ఫలితాల అనంతరం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఆంజనేయులు ఉన్నారు.

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల్లో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగలేదని, ప్రజలు సహకరించారని ఎస్‌ఐ ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. గెలుపు ఓటములు సమానంగా భావించి ప్రతి ఒక్కరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉన్నారని, ఎలాంటి సంఘటనలు జరగలేదన్నారు. తమ సిబ్బందితో, స్పెషల్ ఫోర్స్‌తో ఉదయం నుంచి గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండల ప్రజలు పోలీసు సిబ్బందికి సహకరించటంతో ఎస్‌ఐ అభినందించారు.



నిర్మానుష్యంగా ఉన్న పీజీఎన్ కాంప్లెక్స్



రెవెన్యూ కార్యాలయం ఆవరణ



పట్టణంలో మూసి వేసిన దుకాణాలు